క్లుప్తంగా

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఎస్పీ సుబ్బరాయుడుకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, నాగాలాండ్ ప్రభుత్వ కార్యదర్శి తవసీలన్, ఆయన సతీమణి ప్రిన్సిపల్ కార్యదర్శి మార్థ రీట్సీ దర్శించుకున్న వారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

విలువిద్యలో విద్యార్థిని ప్రతిభ



లోహితారెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన దిస్కూల్ విద్యార్థిని లోహితారెడ్డి రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో బంగారు పతకాన్ని సాధించినట్లు పీవీఆర్ గ్రూప్ డైరెక్టర్ ముకుందరావు తెలిపారు. రాజమండ్రిలో నిర్వహించిన అంతర్ జిల్లాల విలువిద్య పోటీల్లో రాష్ట్ర స్థాయిలో లోహితారెడ్డి సత్తా చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. జనవరి 5న జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులు సన్మానించారు.

బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభం

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి ఈసీఎల్ కంపెనీలో శుక్రవారం సేంద్రియ వ్యర్థాల బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌ను సీఈఓ గోస్వామి ప్రారంభించారు. 18 క్యూబిక్ మీటర్ల పునరుత్పాదక బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ఈ ప్లాంట్ ప్రధానంగా వంటగది, క్యాంటీన్ వ్యర్థాలను ప్రాసెస్ చేసి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజీవ్ ప్రకాష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నాగలాపురం : మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం 2025 క్యాలెండర్లను శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి లత, ప్రధాన అర్చకులు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే ఆదిమూలంకు స్వామి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేసి నూతన క్యాలెండర్లను ఎమ్మెల్యేకు అందజేశారు. ఆలయం వద్ద క్యాలెండర్లను అమ్మకానికి ఏర్పాటు చేసినట్లు ఈఓ లత తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస యాదవ్, శేషాద్రి, ఎస్.ఎం.సురేష్, శ్యామ్, ఎం.డి.కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభం

వరదయ్యపాళెం : అలవికాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు, కూటమి పార్టీలకు ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని సత్యవేడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే భారీగా విద్యుత్ చార్జీలను పెంచి, పేద ప్రజలు నడ్డి విరిచేలా రూ.15,480 కోట్ల విద్యుత్ బిల్లుల భారాన్ని మోపడం, చంద్రబాబు ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని దుయ్యబట్టారు. సంపద సృష్టి అంటే పేద ప్రజలపై భారం మోపడమేనా అని రాజేష్ ప్రశ్నించారు.

ఆలయంలోకి దూసుకెళ్లిన కంటైనర్

- గాయాలతో బయటపడ్డ మహిళ



ఆలయంలోకి దూసుకెళ్లిన కంటైనర్ లారీ

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోనికి కంటైనర్ లారీ శుక్రవారం అర్ధరాత్రి దూసుకెళ్లింది. ఈ ఘటన వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద చోటు చేసుకుంది. అప్పుడే ఆలయం వెలుపల ముగ్గులు వేసి సామగ్రిని ఆలయం లోపల భద్ర పరిచేందుకు వెళ్లగా ఇంతలో కంటైనర్ లారీ ఒక్కసారిగా ఆలయంలోనికి దూసుకురావడంతో గీత అనే మహిళ తీవ్ర గాయాలతో బయటపడింది. కంటైనర్ లారీ నడుపుతున్న డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పక్కనే ఉన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే లోపు వాహన డ్రైవర్ పరారీ అయ్యాడు. గాయాలపాలైన మహిళను వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో గాయపడిన గీత

కదంతొక్కిన పోరుబాట

- సామాన్యులకు కూటమి షాక్
- సూపర్ సిక్స్ మోసం అంటూ కూటమిపై ఆగ్రహం
- కరెంట్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ ఆందోళన

విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చార్జీల పేరుతో భారీగా బాదేందుకు సిద్ధమై ప్రజలకు షాక్ ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని లక్ష్మీకామాక్షి కల్యాణ మండపం వద్ద నుంచి విద్యుత్ కార్యాలయం వరకు శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో కలసి ఆయన ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి నాయకులు విద్యుత్ చార్జీలను పెంచేదే లేదని ఊదరగొట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలు మరిచి ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్లకుపైగా ప్రజలపై భారం వేయడం దుర్మార్గమన్నారు. పేదలైన ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకుని ప్రజలపై భారం లేకుండా చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజలపై ప్రేమ ఉంటే విద్యుత్ చార్జీలు తగ్గించాలని అడగాలని, అవన్నీ వదిలేసి ఎవరిపై ఏ కేసులు పెడదామా అని బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని అన్నారు. రెండు నెలల్లో విద్యుత్ చార్జీలు బాదుడు కనిపించిందన్నారు. పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు బిల్లులు చెల్లించేవారు కాదని ఇప్పుడు దానిని మార్చి బిల్లులు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, వాసుదేవనాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, కూనాటి రమణయ్యయాదవ్, షేక్ సిరాజ్‌బాషా, ఉత్తరాజి శరవణ, కంఠా ఉదయ్, ఈశ్వరరెడ్డి, కొల్లు హరినాథ్‌నాయుడు, సురేష్, పులి రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, సునీల్‌నాయుడు, రామచంద్రారెడ్డి, సుందరరామిరెడ్డి, ఫజిల్, శివ యాదవ్, పసల కృష్ణయ్య, బాలిశెట్టి శేఖర్, మస్తాన్, గఫూర్, రాజా పాల్గొన్నారు.

నాగలాపురం: ఏడీఈ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న, సమన్వయకర్త రాజేష్



నాగలాపురం : ఓ వైపు భారీగా పెంచిన విద్యుత్ చార్జీలతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని దూరం చేసేందుకు కూటమి సర్కారు కుట్ర చేస్తోందటూ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ధ్వజమెత్తారు. ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు చేపడుతున్న ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నాగలాపురంలో శుక్రవారం నిర్వహించిన పోరుబాటకు విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలి వచ్చి మద్దతు పలికారు. నాగలాపురంలోని కల్యాణ మండపం నుంచి ర్యాలీ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్దకు చేరుకుని పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ డిమాండు చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త రాజేష్, పార్టీ శ్రేణులతో కలిసి ఏడీఈ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. స్మార్ట్ మీటర్లు పేరిట దళిత వర్గాలకు ఉచిత విద్యుత్‌ను దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా విద్యుత్ చార్జీలను భారీగా పెంచడం ఆయనకు అలవాటయిపోయిందని విమర్శించారు. ముందస్తు సమాచారంతో ఏడీఈ రమేష్ చంద్ర కార్యాలయానికి గైర్హాజరు కావడం అనైతికమని పార్టీ సమన్వయకర్త రాజేష్ అన్నారు. అపరంజిరాజు (నాగలాపురం), చలపతిరాజు (పిచ్చాటూరు), గవర్ల కృష్ణయ్య(కెవిబి పురం), దయాకర్ రెడ్డి (వరదయ్యపాళెం), సారకాయలు (నారాయణవనం), సునీల్ కుమార్ (సత్యవేడు), రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొరై, శ్యామ్, జిల్లా కార్యదర్శి జగదీష్ రెడ్డి, మహేష్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, ఎంపీపీ దివాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, మోహన్ మొదలియార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, మాజీ డైరెక్టర్ తిలక్ బాబు, మనినాయుడు, గోపాల్ రెడ్డి, గురవయ్య, కవిత, బొప్పన సోమశేఖర్, లాల్ బాబు యాదవ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నాగలాపురం : పోరుబాటలో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు

శ్రీకాళహస్తి : చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం తనిఖీ చేశారు. మొదట పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ కంప్యూటర్ గదిని ప్రారంభించారు. అనంతరం స్టేషన్‌లో పెండింగ్ కేసులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ నరసింహమూర్తి ,సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు 'లీలలు'

- కొత్త సంఘమిత్రకు జీతం చెల్లింపు
- రికవరీకి ఆదేశం



విచారణ చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండల వెలుగుశాఖ అధికారులు, ఆ శాఖలో పనిచేస్తున్న సంఘమిత్రలకు ప్రభుత్వం నుంచి నాలుగు నెలలుగా గౌరవ వేతనాలు మంజూరు కాకున్నా కొత్తగా నియమించుకున్న ఓ సంఘమిత్రకు రెండు నెలల జీతం రూ. 20 వేలు చెల్లించేశారు వెలుగు అధికారులు. ఈ విషయం తెలుసుకున్న వెలుగుశాఖ ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి సిబ్బంది అత్యుత్సాహంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు సంఘమిత్ర నుంచి రెండు నెలల వేతనాన్ని రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన శుక్రవారం తొట్టంబేడు మండలంలోని కొణతనేరి–2లో వెలుగు చూసింది. కొత్త సంఘమిత్రకు నిబంధనలను పక్కన పెట్టి జీతం చెల్లించడంలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఉన్నాయన్నది స్పష్టంగా అవగతమవుతోంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్, అన్నాయ్ నగర్, గణేష్‌నగర్, రామకృష్ణపురం, ఆర్ఈ క్వార్టర్స్, సీబీఐడీ కాలనీలో 132 కె.వి లైన్ కండక్టర్ మార్చటం కోసం శనివారం ఉదయం 07:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : హక్కులు, రక్షణపై బాలల చట్టాలపై అవగాహన కల్పించాలని బాలాజీ బాల వికాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి తెలిపారు. చైల్డ్ ఫండ్–రాస్ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం ఇంద్రానగర్‌లోని రాస్ కార్యాలయంలో శుక్రవారం మహిళా పోలీస్ (జీ ఎంఎస్‌కే)లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుబాటకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బుచ్చినాయుడుకండ్రిగ : నాగలాపురంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యుత్ పోరుబాటకు మండలం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, గోపాల్‌రెడ్డి, గురునాథం, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నాయకులు గురవయ్య, అమరలింగయ్య, మంగయ్య, వెంకటేష్, సాంబయ్య, రాజశేఖర్, కిరణ్ యాదవ్, జ్ఞానకుమార్, వెంకటేశ్వర్లు, పరంధామయ్య, కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు.

వీఆర్వోను సస్పెండ్ చేయాలని నిరసన

వరదయ్యపాళెం : మండలంలోని చిలమత్తూరు పంచాయతీ వీఆర్వో వెంకటరమణ పలు భూ అక్రమాలకు పాల్పడుతూ రికార్డులను తారుమారు చేస్తున్నారని స్థానిక గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వో తీరుకు నిరసనగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం నిరసన చేపట్టారు. 34 మంది పేద రైతుల భూములను బయట వారికి ఇచ్చేందుకు తమ రికార్డుల వివరాలను తెలియజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్య్ర సమరయోధుడు శ్రీవాత్సవనియోగి, ఆయన సోదరుల నుంచి తమ పూర్వీకులు భూములు కొనుగోలు చేసి నేటికీ మా స్వాధీనంలో ఉన్న భూములను అక్రమంగా బయట వారికి ఇచ్చేందుకు నోటీసులు జారీ చేయడంలో వీఆర్వో హస్తం ఉందని వారు ఆరోపించారు. వీఆర్వోను సస్పెండ్ చేయాలని తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో మస్తాన్ నాయుడు, భాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాయులు నాయుడు, నందకిషోర్, ప్రభాకర్, స్వామిదాస్, రామకృష్ణా, వై.సురేష్, రాజగోపాల్ నాయుడులు ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రహ్మణ్యం

సత్యవేడు : మండలంలో రేషన్ దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం డీలర్లు పంపిణీ చేయకుండా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని 55 రేషన్ షాపుల డీలర్లు, ఎండీఎం వాహన దారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. రేషన్ షాపుల వద్ద షాపు నెంబరు తెలిపే బోర్డులో కార్డుల సంఖ్య వివరాలు, పంపిణీ చేస్తున్న నిత్యావసరాల స్టాకు వివరాలు నమోదు చేయాలని సూచించారు. బియ్యం, చక్కెర, కందిపప్పు, జొన్నలు రేషన్ డీలర్లకు సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సురేష్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాళహస్తి : భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆపార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బత్తెయ్యానాయుడు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వెంకటముని, గోపి, వీరరాఘవరెడ్డి, నాగూరయ్య, ఆర్ముగం, నంద పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌కు నాయకులు నివాళులు అర్పించారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ రేణిగుంట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెరుకుతోట రాహుల్ బోస్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. నరసింహులు, గుణ, బాబు, పవన్, ధనంజేయులు పాల్గొన్నారు.

నాగలాపురం : మన్మోహన్‌సింగ్ మృతికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటన్నారు. అనంతరం మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ పార్టీ నాయకులతో కలిసి మౌనం పాటించారు. ఆయన వెంట నాయకులు బీరేంద్రవర్మ, అపరంజిరాజు, చిన్నదొరై, శ్యామ్, హరిచంద్ర రెడ్డి, ఉన్నారు.

నారాయణవనం : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మండల కేంద్రమైన నారాయణవనంలో వైఎస్సార్ పార్టీ నాయకులు, చేనేత కార్మిక నాయకులు చిత్ర పటానికి నివాళి అర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో చేనేత కార్మిక నాయకులు మాట్లాడుతూ.. మన్మోహన్‌సింగ్ చేపట్టిన సంస్కరణలతో దేశం ఎంతో గుర్తింపును పొందిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, దొరైరాజ్, చేనేత నాయకులు గురుస్వామి, శంకరయ్య, సుబ్రమణ్యం, గిరి, పరశురాం, మణి పాల్గొన్నారు.



నాగలాపురం : మన్మోహన్ సింగ్ మృతికి మౌనం పాటిస్తున్న నూకతోటి రాజేష్, నేతలు



నారాయణవనం : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చేనేత నాయకులు



శ్రీకాళహస్తి : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న తలపా దామోదర్‌రెడ్డి

ధ్యానంతో మానసికోల్లాసం



సమావేశంలో మాట్లాడుతున్న వనజాక్షి

నారాయణవనం : ధ్యానాన్ని దినచర్యలో భాగంగా చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిళ్లను అధిగమించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మానసిక ఒత్తిడి–ప్రభావంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో స్విమ్స్ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుండె జబ్బులకు కారణమైన ఒత్తిడిని అధిగమించడానికి ధ్యానంతోనే సాధ్యమవుతుందన్నారు. హార్ట్ ఫుల్ సంస్థ ప్రతినిధులు ధ్యాన అభ్యసనపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ జనార్దన్‌రాజు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వసతిగృహ పరిసరాలు శుభ్రంగా ఉంచండి

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని వసతిగృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్స్‌ను డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్యతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ.. బుచ్చినాయుడుకండ్రిగలోని ఎస్సీ బాలికలు, బాలుర, హాస్టల్స్‌కు రూ. 32 లక్షలు మంజూరయ్యాయని త్వరలోనే మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సహాయ సంచాలకులు ఆనంద్, వార్డెన్లు సాల్మన్‌రాజ్, సుభాషిణి పాల్గొన్నారు.

వరదయ్యపాళెంకు బాలికల హాస్టల్ మంజూరు

వరదయ్యపాళెం : వరదయ్యపాళెం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినుల కోసం నూతనంగా బాలికల హాస్టల్‌ను మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం సంతవేలూరు, వరదయ్యపాళెంలోని ఎస్సీ హాస్టళ్లను సందర్శించి అక్కడ విద్యార్థుల ఇబ్బందులు, వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 12 ఎస్సీ హాస్టళ్లను రూ. 1.18 కోట్లతో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. అలాగే నూతన బాలికల హాస్టళ్లను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వివరించారు. అలాగే సంతవేలూరు మార్గంలో కోతకు గురైన ఆర్ అండ్‌బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులను సీసీఎల్ కాఫీ పరిశ్రమ వారిని చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, నాయకులు నరసరాజు, వెంకయ్య, దశరథన్, సీనప్ప నాయుడు, మునిభూషణమ్మ, తహసీల్దార్ రాజశేఖర్ ఉన్నారు.

గ్రామీణ విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలి



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి రూరల్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని ఊరందూరు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమారి ఆకాంక్షించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఊరందూరు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని జాహ్నవిని శుక్రవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థిని జాహ్నవి మెమెంటో, సర్టిఫికెట్, క్యాష్ ప్రైజ్ రూ.5000 బహుమతిగా గెలుచుకుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల వరకు వెళ్లడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ , శాంతి, మల్లికార్జున, రజియా, మురళి, రమేష్ రెడ్డి, శ్రీనివాసులు, సుమతి పాల్గొన్నారు.